క్లుప్తంగా

డీపీఎంఓకు ఘన సత్కారం



అచ్యుతాపురంలో వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న పీహెచ్‌సీ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: ప్రభుత్వ వైద్య, ఆరోగ్య రంగంలో చేసిన సేవలు సేవా సంతృప్తినిస్తాయని అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యుడు కె.విజయదీపిక, డాక్టర్ ఎస్.కరుణేంద్రకుమారి అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో డీపీఎంఓగా సేవలందిస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పోతుల వెంకటేశ్వరరావు దంపతులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ వెంకటేశ్వరరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సీహెచ్.గోపాలకృష్ణ, ఎంపీహెచ్ఎస్ శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు



అంగర వీరబ్రహ్మేంద్రస్వామి మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగరలో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందబాంబ, సిద్ధయ్య విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. అశిరాంబ అమ్మవారి ఆలయం సమీపంలో శిథిల మందిరాన్ని తొలగించి నూతనంగా నిర్మించారు. స్వామి ఆరాధిక దంపతులు పీటలపై కూర్చుని విఘ్నేశ్వరపూజ, ప్రతిష్ఠ సంకల్పం, వాస్తు హోమ పూజలు చేశారు. ఈనెల 6న స్వామి వార్ల విగ్రహాల తయాహ్నిక ప్రతిష్ఠ, శాంతి కల్యాణ ఉత్సవ పూజలు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మెల్సీగా 'గాదె' విజయంపై హర్షం



నరాల కృష్ణకుమార్

రామచంద్రపురం రూరల్: పీఆర్‌టీయూ తరఫున ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించడంపై పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్ హర్షం వ్యక్తం చేశారు. గాదె శ్రీనివాసులు నాయుడు గతంలో 2 సార్లు ఎమ్మెల్సీగా పనిచేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కీలక భూమిక వహించారన్నారు. అటువంటి అనుభవం ఉన్న వ్యక్తికి మరోసారి పట్టం కట్టిన ఉపాధ్యాయులందరికీ జిల్లా పీఆర్‌టీయూ కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు. మూడో సారి ఎమ్మెల్సీగా ఎంపికవడం, ఆయన అనుభవం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్త్రీశక్తి ప్రత్యేకతను ప్రతి ఒక్కరూ గౌరవించాలి



నేలటూరులో పౌష్టికాహారం ప్రాధాన్యాన్ని వివరిస్తున్న ఐసీడీఎస్ ప్రతినిధి

కపిలేశ్వరపురం: స్త్రీ శక్తి ప్రత్యేకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు అన్నారు. ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ పరిధిలోని అంగర సెక్టార్ ఆధ్వర్యంలో మంగళవారం నేలటూరులో పోషకాహార ప్రాధాన్యతపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీలు పోషక విలువలు కలిగిన వివిధ రకాల వంటకాలను స్వయంగా తయారు చేసి ప్రదర్శించారు. పౌష్టికాహారం ప్రాధాన్యతను చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులకు వివరించారు. ఐసీడీఎస్ కార్యాలయం, సచివాలయ అధికారులు మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అత్త మెడపై కత్తితో పొడిచిన అల్లుడు

మండపేట: స్థానిక గాంధీ నగర్‌లో ఓ ఇంటిలో జరిగిన గొడవలో జవ్వాది శ్రీనివాసు తన భార్యను కొట్టి, అత్తపై కత్తితో దాడి చేసి గాయపర్చిన ఘటనపై మండపేట పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాదుదారు గానుగల సత్యవేణి గాంధీనగర్‌లో నివాసముంటున్నారు. తన ఇంటిపై అంతస్తులో ఆమె కుమార్తె హైమ, అల్లుడు జవ్వాది శ్రీనివాసు నివాసముంటున్నారు. సోమవారం శ్రీనివాస్ తన కుమార్తెను కొట్టాడని, అనంతరం తన మెడపై కూరగాయల కత్తితో పొడిచినట్టు సత్యవేణి పోలీసులకు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వామ్మో ఎండలు!

- వేసవి ప్రారంభంలోనే నిప్పులు చెరుగుతున్న భానుడు
- రోజు రోజుకూ పెరుగుతున్న గ్రీష్మతాపం
- అధిక ఉష్ణోగ్రతలకు అల్లాడుతున్న జనం
- వేసవిలో ప్రబలే వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



మధ్యాహ్న సమయంలో ఎండ వేడిమికి ఇబ్బంది పడుతూ ప్రయాణిస్తున్న మహిళలు

రాయవరం: భానుడు భగభగమంటూ నిప్పులు చెరుగుతున్నాడు. గ్రీష్మతాపం అధికమవుతోంది. ఉదయం 10 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉష్ణోగ్రత రోజు రోజుకూ పెరుగుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. ఎండ తీవ్రతను చూసి మధ్యాహ్నం వేళ జనం బయటకు వెళ్లేందుకు వెనుకంజ వేస్తున్నారు. పగటి పూట ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పగటి పూట ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. కనీస ఉష్ణోగ్రత 22 డిగ్రీలుగా ఉంటోంది. పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తగిన ఆరోగ్య రక్షణ సూత్రాలు పాటించకపోతే వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఆహారం, నీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. శరీరంలో తేమ(నీటి) శాతం ఉండాల్సిన దానికన్నా తగ్గకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

వేసవిలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి

వేసవిలో సాధారణంగా అతిసార ఎక్కువగా ప్రబలుతుంది. ఎండలో తిరిగే వారు వడదెబ్బకు గురవుతుంటారు. అతిసారం సోకకుండా సురక్షితమైన నీటిని మాత్రమే కాచి చల్లార్చి వడబోసి తాగాలి. బావులు, బోర్లు, చెరువు కాలువ నీళ్లను క్లోరినేషన్ తర్వాతనే ఉపయోగించాలి. తాగునీటిని పరిశుభ్రమైన పాత్రల్లో నిల్వ చేసి, పాత్రలపై మూతలు పెట్టాలి. వంట గదిలో ఆహార పదార్థాలపై కోసిన పండ్లు, కూరగాయ ముక్కలపై దుమ్ము, ధూళి, ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యవంతులైన వారు మాత్రమే వంట చేయాలి. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసర ప్రాంతాల పరిశుభ్రత పాటించాలి. వేడిగా, తాజాగా ఉన్న ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలి. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. మల,మూత్ర విసర్జన తర్వాత చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. చెత్త చెదారాన్ని ఎత్తివేసి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

వడదెబ్బ లక్షణాలు.. ప్రథమ చికిత్స

తలనొప్పి, తల తిరగడం, ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం కలిగి ఉండడం, మగత, కలవరింతలు, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మార స్థితిలోకి వెళ్లడం. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. వడదెబ్బ బాధితుడి శరీరంపై ఉండే దుస్తులను తొలగించి, చల్లని నీటితో కడగాలి. ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరం అంతా తుడవాలి. శరీరం అంతా చల్లని గాలి తగిలేలా చూడాలి.

బాధితులకు చల్లని నీరు లేదా ఉప్పు ఇతర లవణాలు కలిసిన నీటిని (ఓఆర్ఎస్ ద్రావణం) తాగించాలి.

అతిసారం లక్షణాలు కనిపిస్తే..

ఒకటి లేక నాలుగు సార్లు నీళ్లతో కూడిన విరేచనాలైతే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి చికిత్స పొందాలి. వాంతులు, నీళ్ల విరేచనాలు అవుతుంటే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. ఇంటిలో లభించే గంజి, పలుచని మజ్జిగ, పప్పు నీరు, కొబ్బరినీళ్లు తాగించాలి. బిడ్డకు విరేచనాలవుతుంటే తల్లిపాలు బిడ్డకు ఇస్తూనే ఉండాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ఎండలో తిరగకుండా జాగ్రత్తలు వహించాలి. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన పళ్ల రసాలు తాగి వెళ్లాలి. తెల్లని దుస్తులు ధరించాలి. నల్లని, ముదురు రంగు వస్త్రాలు వేడిని ఆకర్షిస్తాయి. వేసవిలో మద్యం సేవించడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. అది విషమ పరిస్థితికి దారి తీస్తుంది. ఇంటి ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు కిటికీలకు తలుపులకు తెరలను వాడాలి. ఎండలో వెళ్లేటప్పుడు గొడుగు, టోపీలు, తలపాగా వంటివి ధరించాలి.

చిన్నారులు ఎండలో తిరగకుండా చూడాలి



శరీరానికి గాలి తగిలే దుస్తులు వాడాలి. రోజుకు అవసరాన్ని బట్టి పెద్దలు 6 నుంచి 8 లీటర్ల నీటిని తీసుకోవాలి. పిల్లలు ఎండలో ఆడకుండా చూడాలి. బయట ఆహారాన్ని తీసుకోకపోవడం మంచిది. పీహెచ్‌సీ పరిధిలో అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ వి.అనిరుధ్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, రాయవరం

జాగ్రత్తలు అవసరం



పెరుగుతున్న ఎండలు నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారులు, వృద్ధుల విషయంలో మరింత జాగ్రత్తలు అవసరం. వడదెబ్బ లక్షణాలుంటే వెంటనే సమీపంలో ఉన్న వైద్యులను సంప్రదించాలి. సాధ్యమైనంత వరకు అధికంగా మంచినీరు తాగుతూ ఉండాలి.

– డాక్టర్ ప్రవీణ్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, రామచంద్రపురం

పేట్రేగిపోతున్న ఆకతాయిలు



కాజులూరులో యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై మోహన్‌కుమార్

కాజులూరు: మండల గ్రామాల్లో ఇటీవల ఆకతాయిల ఆగడాలు రోజురోజుకీ అధికమవుతున్నాయి. కళాశాలలు, పాఠశాలల వద్ద కొందరు ర్యాగింగ్‌లకు పాల్పడుతూ విద్యార్థులను అల్లరి పెడుతుండగా కొందరు యువకులు మద్యం తాగి రహదారులపై వెళ్లే ప్రయాణికులను ఆపి వారితో ఘర్షణకు దిగుతున్నారు. కొందరైతే కులసంఘాలు, యువజన సంఘాలు పేరుతో వ్యాపారులను బెదిరించి డబ్బులు గుంజుతున్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు స్థానిక నేతలు వీరికి అండగా నిలుస్తుండటంతో వీరి ఆగడాలు అడ్డు, అదుపు లేకుండా పోతున్నాయి. కాజులూరు కళాశాలలు, పాఠశాలల వద్ద అమ్మాయిలు వచ్చి, వెళ్లే సమయాలలో కొందరు యువకులు అల్లర్లకు పాల్పడుతుండటంతో స్థానికుల ఫిర్యాదుల మేరకూ గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ గట్టి నిఘా పెట్టారు. గత 10 రోజుల క్రితం పరిసరాల్లో తిరుగుతూ కనిపించిన 13 మంది యువకులను ఎస్సై మోహన్‌కుమార్, గొల్లపాలెం పోలీస్టేషన్ సిబ్బంది ఆపి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అదే విధంగా ఇటీవల గత వారం రోజుల క్రితం రాత్రి సమయంలో ఒక శుభకార్యానికి వెళ్లి వస్తున్న ఒక ఆటోని కాకినాడ కోటిపల్లి రహదారిలో ఆర్యావటం కోళ్ళతూము సెంటరు వద్ద మద్యం తాగి సుమారు 10 మంది యువకులు ఆపి ఘర్షణకు దిగారు. ఆటోలో మహిళలపై అసభ్యంగా ప్రవర్తించారు. అయితే అందులో ప్రయాణిస్తున్న పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఒక వ్యక్తి తెలివిగా వారి నుంచి తప్పించుకుని మరుసటి రోజు గొల్లపాలెం పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులు 10 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు స్థానిక రాజకీయాల నేపథ్యంలో వారిపై ఎటువంటి కేసులు నమోదు చేయకుండా మందలించి వదలివేశారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఆకతాయిల ఆగడాలపై గట్టి నిఘా పెట్టి స్థానికులను వ్యాపారులకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై పోస్తే జరిమానా



ధర్మగుండం వీధిలో తడి-పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట: పట్టణంలో వివిధ రకాల కట్టడాలు నిర్మిస్తున్న వారు వ్యర్థాలను ఇష్టానుసారం రోడ్లపై విడిచిపెడితే జరిమానాలు విధిస్తామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు హెచ్చరించారు. స్వచ్ఛ మండపేట ఆశయ సాధనలో భాగంగా కొన్ని రోజులుగా పురపాలక సంఘంలోని 30 వార్డుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇళ్ల నుంచి వచ్చిన చెత్తను వేరు చేయు విధానం, సేంద్రియ ఎరువు తయారీ, ప్లాస్టిక్ నిర్మూలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను చైతన్యపరిచామన్నారు. కొంతమంది అధికారుల సూచనలు పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి స్వచ్ఛ మండపేటకు సహకరించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం 15వ వార్డులో పర్యటించారు. ధర్మగుండం చెరువు గట్టు చుట్టూ ఉన్న వీధులు, వృద్ధాశ్రమం వెనక ఉన్న మహిళా నగర్‌లో ఆయన ఇంటింటా పర్యటించి పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆ వీధిలో భవనం యజమానికి అపరాధ రుసుము విధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కె.శ్రీనివాస్, ఏఈలు డీ పవన్‌కుమార్, బీ ఆంజనేయులు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, ఆర్పీలు, సచివాలయ కార్యదర్శులు వెంకన్న, కిషోర్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి లక్ష పుష్పార్చన



అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న అర్చకులు

మండపేట: అర్తమూరులో భక్తుల నీరాజనాలు అందుకుంటున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 5వ రోజైన మంగళవారం ఉదయం స్వామి వారికి నిత్య పూజలు, సుదర్శన హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం లక్ష తులసి, లక్ష పుష్పార్చనలతో పాటు అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ద్వారపూడికి చెందిన సాయిబాబా ఉపాసకులు నాగబాబు పర్యవేక్షణలో సత్తి బులిస్వామిరెడ్డి శ్రీదేవి దంపతులు, కర్రి బాపిరెడ్డి మహాలక్ష్మి దంపతులు సహస్ర దీపాలంకరణ సేవ చేశారు. కర్రి శ్రీమహాలక్ష్మి, కోనాల కమల, శిరంగు వాణి బృందం నిర్వహించిన వేంకటేశ్వరస్వామి భక్తి గీతాలాపనను మహిళలు, చిన్నారులు పాల్గొని వీక్షించారు. టీటీడీ పురందారానుగ్రహ బిరుదు అందుకున్న ఆలమూరుకు చెందిన ముంకుందేశ్వర స్వామిని, సీతారామ భక్తజన మండలి సభ్యులను గ్రామంలోని వేంకటేశ్వర భక్తజన మండలి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సన్‌రైజ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్ కొవ్వూరి ఆదిరెడ్డి, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

అఖండ భగవన్నామ సన్నాహక సమావేశం



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో సప్తాహంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న మహిళా భజన బృందం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న అఖండ భగవన్నామ సంకీర్తన(సప్తాహం) మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ హిందూధర్మ ప్రచారకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సప్తాహంలో మొదటి రోజు ఆయన నేతృత్వంలోని వేట్లపాలెం బృందం, తిర్లంపేట పలివెల శారద నేతృత్వంలోని రాజురాజేశ్వరి మహిళా సమాజం, చోడిశెట్టి మల్లేశ్వరి నేతృత్వంలోని ద్రాక్షారామ మహిళా సమాజం పారాయణ, మండపేటకు చెందిన పద్మ సాయి నేతృత్వంలోని సాయి మహిళా భజన బృందం, నీలం పట్టాభి నేతృత్వంలోని దాసరపాడు ప్రసన్నాంజనేయ భజన బృందం, దొమ్మేటి శ్రీను నేతృత్వంలోని కంబాలచెరువు సీతా రామాంజనేయ భజన బృందం, రెడ్డి ఈశ్వరి నేతృత్వంలోని మామిడిగుంట మహాలక్ష్మి మహిళా సమాజం, వాసంశెట్టి వెంకటరమణ నేతృత్వంలోని తాళ్లపొలం సీతారామ భజన మండలి, దొమ్మేటి సతీష్ నేతృత్వంలోని తిర్లంపేట భజన బృందం, ముద్రగడ సత్యమూర్తి నేతృత్వంలోని తోటపేట లక్ష్మీ గణపతి భజన బృందాలు తమ భక్తి గీతాలతో అలరించారు. అఖిల భారత ప్రాచీన తెలుగు జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ(సతార్ స్వామి), అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీరవల్లిపాలెంలో బౌద్ధ భిక్షువు పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న బౌద్ధ భిక్షువు బోధిహీన్

అయినవిల్లి: శ్రీలంక నుంచి తెలుగు రాష్ట్రాల పర్యటనలో భాగంగా బౌద్ధ భిక్షువు బోధిహీన్ మంగళవారం వీరవల్లిపాలెం చేరుకున్నారు. పర్యటనలో భాగంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ ఆంధ్ర ప్రజలు దయ, దాతృత్వంతో తులతూగుతున్నారన్నారు. అన్నదానంలో తెలుగు రాష్ట్రాలు ముందుంటాయన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలన్నారు. ఏపీలోని అమరావతికి బౌద్ధ భిక్షువులు రావడానికి ఇష్టపడుతున్నారన్నారు. సనాతన ధర్మంలో బౌద్ధ ధర్మం కూడా మూలధర్మమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బౌద్ధ ధర్మం ఆనవాళ్లు కోకొల్లలుగా ఉన్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వం బౌద్ధ స్థూపాల వద్ద కనీస వసతులు కల్పించాలన్నారు. ముఖ్యంగా సనాతుడిగా డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్ ముందుకు రావాలన్నారు. దేశంలో 60 బౌద్ధ స్థూపాలు ఉండగా 40 స్థూపాల వద్ద కనీస వసతులు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద నిధులున్నాయన్నారు. ఆ నిధులతో బౌద్ధ ఆరామాలను అభివృద్ధి చేయాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా ఆవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్, విద్యాశాఖ ప్రతినిధులు

ఆలమూరు: యోగా నేర్చుకోవడం ద్వారా మహిళలు సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.గజలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని ఐసీడీఎస్, విద్యాశాఖ ఆధ్వర్యంలో పలు వినూత్న కార్యక్రమాలు జరిగాయి. మహిళా దినోత్సవం మూడో రోజైన మంగళవారం ఆయా అంగన్‌వాడీలు, పాఠశాలల్లో యోగా ఆవశ్యకతను వివరించారు. మహిళల అభ్యున్నతి కోసం తీసుకోవలసిన చర్యలను సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, వై.అరుంధతి వివరించారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి



క్విజ్ పోటీలో విజేతగా నిలిచిన గీసాల తేజ శ్రీరమ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాజులూరు: సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని ప్రతి విద్యార్థీ ఒక శాస్త్రవేత్తగా ఎదగాలని కాజులూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు చింతా నారాయణమూర్తి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా సైన్స్ దినోత్సవంలో పాల్గొని క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్, జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్‌ల చేతుల మీదుగా అవార్డు అందుకున్న పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని గీసాల తేజ శ్రీరమ్యను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలను బట్టీపట్టే విధానాన్ని విడనాడి ప్రతి అంశంపైనా అవగాహన పెంచుకునే విధానాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పద్మారావు, ఉపాధ్యాయులు శ్యాముల్‌బెన్‌హర్, కెవివి సత్యనారాయణ, కె.హరినాథ్, సునీలాదేవి విద్యార్థులు పాల్గొన్నారు.

పటేల్ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎస్‌ఎంసీ సభ్యులు

మండపేట: పట్టణంలోని శ్రీ పటేల్ మున్సిపల్ ప్రైమరీ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసి వార్డుల్లోని చిన్నారులకు అందుబాటులోకి తేవాలని ఆ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) వైస్ చైర్మన్ చింతల జయమణి కోరారు. మంగళవారం 23, 24 వార్డుల పరిధిలోని సైదిల్‌పేట వీధిలో ఉన్న పటేల్ స్కూల్లో ఎంఎంసీ సమావేశం నిర్వహించారు. జయమణి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో టీడీపీ నియోజక వర్గ ఉపాధ్యక్షుడు చింతల శ్రీనివాస్, 23వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు రామకృష్ణ, 24వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి కడియాల వెంకటలక్ష్మి పాల్గొని పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. ఇప్పటి వరకూ 1, 2 తరగతులు మాత్రమే కొనసాగుతున్నాయని, దీన్ని మోడల్ స్కూల్‌గా మార్పు చేసి 3, 4, 5 తరగతులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. రెండు వార్డుల్లో చిన్నారులకు అందుబాటులో ఉన్న పాఠశాలలో 5వ తరగతి వరకూ బోధించేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో హెచ్‌ఎం సుబ్బాయమ్మ, ఉపాధ్యాయురాలు కావేరి, కడియాల గోవిందు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



దుప్పట్లు వివిధ సామగ్రి పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రవీణ్, వెంకటరెడ్డి తదితరులు

రామచంద్రపురం: అభాగ్యులకు వారికి కావాల్సినవి అందించడం ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతిరోజు జరుగుతున్న స్పర్శ ప్రోగ్రాం మంగళవారం పట్టణంలో ప్రసన్న విఘ్నేశ్వర ఫంక్షన్ హాల్‌లో జిల్లా పారామెడికల్ అధికారి మాధవరపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగినది. కార్యక్రమంలో ప్రసన్న విఘ్నేశ్వర గ్రూప్ సంస్థల అధినేత సత్తి వెంకటరెడ్డి 50 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, ప్లేట్లు భోజన సదుపాయం కల్పించి మానవసేవే మాధవ సేవ అనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ రఘువీర్ మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న వెంకటరెడ్డి ఎందరికో ఆదర్శనీయుడన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన వారంతా కుష్ఠు వ్యాధిగ్రస్తులకు విరివిగా సేవలు అందించాలన్నారు. మరో ముఖ్య అతిథి ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. ఎక్స్ ఏపీ స్టేట్ ఇరిగేషన్ రిసోర్స్ పర్సన్ కొవ్వూరు త్రినాథ్‌రెడ్డి మాట్లాడుతూ మల్టీ డ్రగ్ థెరపీ వచ్చిన తర్వాత వ్యాధి తీవ్రత గణనీయంగా తగ్గిందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఫార్మ్రీ ఫెడరేషన్ కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, మేడపాటి శ్రీధర్‌రెడ్డి, జిల్లా నోడల్ అధికారి చిక్కాల సూర్యారావు, రిటైర్డ్ డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ బక్కి రవీంద్ర, విశ్రాంత డిప్యూటీ పారా మెడికల్ అధికారి గొల్లపల్లి కృష్ణ, రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ బి.కృష్ణారావు పాల్గొనడం జరిగింది.

బాలబాలికలు విద్యపై శ్రద్ధ వహించాలి



సెయింట్ ఆన్స్ స్కూల్లో నిర్వహించిన పోటీలను పరిశీలిస్తున్న సీఐ సురేష్, ఎస్సై శాస్త్రి

మండపేట: బాలబాలికలు విద్యపై శ్రద్ధ వహించి లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తూ ఉన్నత స్థానాలు అధిరోహించాలని టౌన్ సీఐ దారం సురేష్ అన్నారు. బాలికలు ఎందులోనూ తీసిపోరని, అన్ని రంగాల్లో ముందంజలో ఉంటూ మహిళా లోకానికి స్ఫూర్తిదాయయంగా ఎదగాలని సూచించారు. ఈ నెల 8న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఎస్పీ ఆదేశాలతో రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ సూచనలతో టౌన్ సీఐ సురేష్, ఎస్సై హరికోటి శాస్త్రి పట్టణంలో వివిధ పాఠశాల విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సెయింట్ ఆన్స్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పోటీలకు పాఠశాల ప్రిన్సిపాల్ సహకారం అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో పట్టణంలోని 11 పాఠశాలల నుంచి 6 నుంచి 9వ తరగతి విద్యార్థినులు 186 మంది పాల్గొని తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించారని చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని ఎస్సై శాస్త్రి తెలిపారు.